ప్రేమ దేవత నవ్వింది

శ్రీ బొడ్డు బాపిరాజు

సరోజిని వాకిట్లో నిలబడి చూస్తూ వుంది. సరిగ్గా అతను వచ్చే సమయం అదే. ప్రొద్దుటే తలంటుకున్న తల ఆరడానికని తల్లి కట్టిన పిడప విప్పి పట్టుకుచ్చులా వున్న బారెడు జుట్టూ రెండు పాయలు చేసి ఎడంపాయ చెవిపక్కన విలాసంగా తెలుముడి వేసి కుడిపాయను వట్టివేళ్ళ కుంచితో చిక్కు తీసుకుంటూ సరోజిని వాకిట్లో నిలబడి అతనికోసం ఎదురుచూస్తూ వుంది. ప్రతిరోజూ సరిగా అతను వచ్చే వేళ అదే. మూడు రోజులనించీ అతనికోసం తను యిలాగే కాచుకుని వుంటూ వున్న సంగతి గుర్తొచ్చింది కాబోలు సరోజిని పెదవి కొసల్లో వొక నవ్వు సన్నని వెన్నెల తెరలా కదిలింది. ఇన్నాళ్ళనించీ తను అతన్ని చూస్తూనే వుంది. కాని అతనుమాత్రం తనవేపే కాదు గుమ్మంవేపు కూడా చూడకుండా తనముందునించీ వెళ్ళిపోతున్నాడు. అతన్ని పిలిచి ఏమిటో మాట్లాడాలనుకునేది కాని ఆ లేత గుండె కంత నిబ్బరం లేకపోయింది.

అతనికోసం పడిగాపులుపడి కాచుకుని వున్నంతసేపైనా లేకుండా అతను చూసీ చూడనట్టు నిర్లక్ష్యంగా వెళ్ళిపోతూవుంటే తనమీద తనకే విసుగూ కోపం కలిగేయి. 'ఇలా అతనికోసం పిచ్చిగా చూస్తూంటే ఎవరన్నా నవ్వుతారు కూడా. ఇక చూడకూడ' దనుకునేది. అపట్టు ఎంతవరకూ? ఆ రాత్రితో చెల్లు! మర్నాడు మళ్లీ అతను వచ్చేవేళకు తనకు తెలియకుండానే కాళ్లు వాటంతటవే గుమ్మందగ్గరకు నడిపించేవి. కళ్ళు వీధిని కలజూచేవి.

సరోజిని వీధి మొగదలదాకా పరకాయించి చూచింది. అతను వచ్చే జాడా జవాబుకూడా కనిపించలేదు. అప్పుడే బడి వదిలిపెట్టినట్టున్నారు. తమ్ముడూ చెల్లాయి చేతుల్లో సంచులు వూపుకుంటూ వస్తున్నారు. ఈపాటికి అతను రావలసిందే మరి. త్రోవలో ఏం ఆలస్య మయిందో!

'వస్తున్నా నే!' ఆ మాటకు పరధ్యానంలో వున్న సరోజిని త్రుళ్లిపడి వెనక్కు తిరిగింది. పక్కవాటాలో అద్దెకున్న వాళ్ల అమ్మాయి లోపల్నించీ తల్లి పిలుస్తూంటే తమ్ముణ్ణి గురించి 'వస్తున్నా నే!' అంటూ వుంది. తను త్రుళ్ళిపడ్డందుకు సరోజిని నవ్వుకుంది.

చిక్కు తీసుకుని వొదులుగా జడ అల్లుకోవడం అయింది. 'బుల్లెమ్మగారూ! ఎప్పుడొచ్చారూ?' అంటూ బజారున పోతూ వున్న యింటి చాకలిది పద్దాయి వాకిట్లో నిలబడ్డ తన్ను చూచి పలకరించింది. దానికి సమాధానం చెపుతూవుండగానే తమ్ముడూ చెల్లాయి 'అక్కా, అయిస్క్రీం కొని పెట్టవే' అంటూ చెయ్యి వొకళ్ళూ చెంగొకళ్ళూ లాగారు. 'అప్పులవాళ్లనన్నా తప్పించుకోవచ్చునేమో కాని వీళ్ళను తప్పించుకోలేం' అనుకుంటూ చెరో కానీ యిచ్చి వదిలించుకుంది. పిల్లలు చేతిలో కానీ పడ్డంతోనే బడిసంచు లక్కడే పడేసి పరుగెత్తారు. వాళ్ళను చూస్తూ వున్నట్టుగానే చూసింది అతను వస్తున్న పొడ కనపడ్డంలేదు.

వంటింట్లోనించి 'సరోజా!' అంటూ తల్లి ఎందుకో కేకవేసింది. వెంటనే వెళ్లకపోతే 'ఓంయ్' అన్నా అమ్మ వూపిరి సలపకుండా కేకమీద కేక వేస్తుంది. సరోజిని కాసంగతి తెలుసు! మళ్ళీ వొఖసారి అనుమానం తీరా వీధి యీ చివర్నించీ ఆ చివరివరకూ పారజూచి యింట్లోకి వెళ్ళిపోయింది అమ్మ పిలుపుకు.

అప్పమ్మ తోమిన అంట్లన్నీ తోలుచుకుని, దానికి కొంచెం పచ్చడివేసిన చద్దన్నం తపాలా యిచ్చి, అది వెళ్ళాక దొడ్డిగుమ్మం గొళ్లెంపెట్టి అమ్మకు కూర తరిగిచ్చి, పొయ్యి వూదే గొట్టం చారుతప్పాలా యిలా అన్నీ వొకటొకటీ ఆర్చుకుని తీర్చుకుని అమర్చి వచ్చేసరికీ అరగంట పట్టింది. సరోజిని లోపలినించీ వాకిట్లోకి రావడం అతను గుమ్మం దాటి వెళ్ళిపోవడం ఆ వొక్క క్షణంలో జరిగాయి. ప్రొద్దుట్నించి ఆ పిల్ల పడ్డ ఆపసోపాలన్నీ అంతలో వృధా అయిపోయాయ్. పాపం పిచ్చిపిల్ల! కళ్ళనిండా నీళ్లు నిలిచాయి.

*   *   *

సరోజిని అత్తవారింటికి కాపరానికి వెళ్ళాక పుట్టింటికంటూ రావడం యిదే మొదటి పర్యాయం. సరోజిని మామగారు మంచి పేరున్న లాయర్. పేరుతోపాటు డబ్బూ సంపాదించాడు. నౌకర్లూ చాకర్లతో డాబూ దర్పంగా వుంటుంది కుటుంబం. అందుకు తగినట్టు రాజమహల్లాంటి చక్కని మేడ. ఇద్దరే కొడుకులు. వయసులో కన్న కొడుకూ, పోగు చేసి కొన్న ధనమూ అన్నట్టు చేతికందిన పెద్దవాడు సుందరం పట్టాపుచ్చుకుని తండ్రి కళ్లనీడల్లో ప్రాక్టీస్ ప్రారంభించాడు. సుందరం కోరిక ప్రకారం కట్నాలూ కానుకలూ లెక్క చెయ్యకుండా చందన బొమ్మలాంటి సరోజినిని కోడలుగా చేసుకున్నాడు లాయర్ గారు.

ప్రథమంగా కాపురానికని తీసుకు వెళ్ళడానికి సరోజిని అత్తగారూ మరిదీ వచ్చారు. అమ్మనీ నాన్ననూ తోబుట్టిన వాళ్ళనూ పుట్టి పెరిగిన యింటినీ చిన్నప్పట్నించీ కలిసీ మెలిసీ తిరిగిన యిరుగూ పొరుగుల్నీ చెలికత్తెల్నీ యిందర్నీ విడిచిపెట్టి వెళ్ళడం అంటే సరోజినికి చాలా కష్టమే అనిపించింది. కాని వీటన్నిటి కన్నా బలంగా ఆ చిన్ని హృదయాన్ని ఆకర్షిస్తూ వున్న ఒక మాధుర్యం ఆహ్వానిస్తూ వుంటే ఆమెకు వెళ్ళడం ఆనందంగానే వుంది. ఇదే మొదటిసారి కనుక పుట్టింటివారు వున్నంతలో సారె చీరా సున్నీ పసుపూ చలిమిడీ పెట్టి పంపారు. కొత్త గనుక పిల్లతోపాటు 'చంటివాళ్ళ' నిద్దర్నీ తీసుకుని తల్లి కూడా అమ్మాయి అత్తవారింటికి వెళ్ళింది.

అత్తవారింటవద్ద వున్న పది పదియేను రోజులూ నిమిషాల్లాగా తియ్యని కలల్తో గడిచిపోయాయి. అత్తగారి ఆదరం, మామగారి మమతా, మరిది సరదాలూ అన్నిటి కన్నా తన్ను ఆకాశపు అంచుల కెత్తిన ఆయనగారి అనురాగబంధమూ 'ఇదే నా కొత్త చోటు?' అనిపించి ఆ కన్నె తలపుల్ని వుక్కిరి బిక్కిరి చేసివేశాయ్. కొన్నాళ్ళకు నాన్న వచ్చి 'ఒక నెల్లాళ్ళు పోయాక మళ్ళీ పంపిస్తా'నని మామగారితో చెప్పి అమ్మనూ తననూ తీసుకువచ్చాడు.

అక్కణ్ణించీ వచ్చాక రెండు మూడు రోజులవరకూ ఆ సువాసనలూ, తియ్యదనాలూ, కలలూ, వెంటాడుతూ వుంటే చెలికత్తెల్తో చుట్టపక్కాల్తో యిరుగు పొరుగుల్తో అక్కడి అత్తవారింటి ముచ్చట్లు చెప్పుకోవడంతోనే సరిపోయింది.

అక్కడ్నించీ వచ్చిన మూడోనాడనుకుంటా అతన్ని, వీధిలోనించి వెడుతూ వుంటే హఠాత్తుగా చూసింది సరోజిని. ఆచిన్ని మెదడులో ఎన్నో తియ్యతియ్యని ఆలోచనలు వరదలనాటి కొండవాగులో అలలు సుళ్లు తిరిగినట్టు తిరిగాయి. తెల్లని వెన్నెలరాత్రులూ, తడిసిన సముద్రపు తీరాలూ చల్లని వుద్యానవనాలూ వొకటొకటే కళ్ళల్లో కదుల్తూ వున్నాయి సిగ్గుతో సరోజిని పచ్చనిచెక్కిళ్లు ఎఱ్ఱబడ్డాయి.

* * *

ఒకరోజు కొకరోజు సరోజిని మన్ను తిన్నపాములా మరీ ముందకొడిగా వుంటూ వుంది. ఏపనిచేస్తున్నా మనసెక్కడో పెట్టుకున్నట్టు చేస్తుంది. ఏమాటా వొకటికి రెండుసార్లూ చెపితేనేకాని వినిపించుకోదు. వినిపించుకున్నా ఆమాట అర్థం మనస్సుకు పట్టనేపటదు. ఆపరాకుకు తోడు చింతాకంత చిరాకుకూడా తోడయింది. అన్నిటికన్నా పరధ్యాన్నం ఎక్కువయింది. ఉప్పడిగితే పప్పిస్తుంది. 'పులుసులోకి నాలుగువంకాయలు ముక్కలు తరిగివ్వు తల్లీ' అని తల్లి చెపితే, అవికాస్తా వేపుడుముక్కలు తరిగూరుకుంటుంది 'ఇదేమే?' అంటే 'వినలేదులే' అని జవాబు. గట్టిగా అడిగితే కన్నీళ్లే జవాబు. ఈ అయిదారు రోజుల్లో గాజు పళ్లాలయితేనేం కాఫీ కప్పులూ సాసర్లయితేనేం అరడజనుకు తక్కువకాకుండా పగలకొట్టింది. 'ఏమిటే అమ్మా! ఇదంతా యిక్కడ గనక సరిపోయింది. యిదే అత్తవారింట్లో అయితే ఎలానే? అని తల్లి అంటుంది. సరోజినిమాత్రం 'నావొంట్లో బాగోలేదే' అంటుంది. అక్కడితో తల్లి యిక మాట్లాడదు.

ఎన్నింటిమీద అశ్రద్ధా చిరాకూ పరాకూ వున్నా టంచన్‌గా అతను వచ్చే వేళకు వాకిట్లో నిలబడ్డంలో మాత్రం ఏ పరాకూ వుండదు. 'నాన్నా అమ్మా చూస్తే ఏమనుకుంటారో!' అని మధ్యమధ్య అనిపిస్తూవున్నా ఆ ఆకర్షణనించీ తన్ను తను సంబాళించుకోలేకపోతూవుంది. అతనికోసం కాచిపెట్టుకుని వుండడంలోని ఆతియ్యనిబాధ తనకే తెలుసు. అప్పుడేయీ ప్రతీక్ష మొదలై పదిరోజులు దాటింది. ఇంతవరకూ వొక్కసారీ అతనిచూపు సరోజినివేపు వాలనేలేదు. అసలతను ఆ అమ్మాయి వునికినే గమనించినట్టు లేదు. ఒకసారి మాత్రం

ఒకటి రెండుసార్లు ఆ అమ్మాయి అతను వచ్చే వేళకు తన మోస్తరే గుమ్మంలో తార్లాడడం సరోజిని చూచింది... తనలో తను "బాగుందిలే వరస!" అనుకుంది.

గుమ్మంలోవున్న నాన్న అతన్ని పలకరించినట్టున్నారు. అతనేదో నవ్వుతూ జవాబు చెప్పుకుంటూ వెళ్లిపోయాడు. అమ్మకేదో వంటింట్లో అందిస్తూవున్న తను లోపల్నించే చూసిందివంతా.

సరోజిని మేనత్త తమ్ముణ్ణీ మరదల్నీ చూడ్డానికంటూ వచ్చింది. ఆడదంటావి అదో చాదస్తపు తరహా. తగని ఆచారం. అందుకు సరిపోయినంత అనుమానం. ఆచారంలో నిప్పైనా కడుగుతుంది. అనుమా

★ ప్రేమదేవత నవ్వింది ★

నంలో అరుంధతినైనా నిలబెడుతుంది. తన మడి ఎక్కడ చెడుతుందో అని వస్తూనే వంటిల్లు ఆక్రమించుకుంది. తను వున్నన్నాళ్ళూ మరొకరక్కడ అడుగుపెట్టడానికి వీల్లేదు. వంటపని తప్పిందన్నమాటే కాని తల్లికీ సరోజినికీ ఆవిడ కదనీ యిదనీ అందించడంలో అంచె గుఱ్ఱాలు పరిగెత్తినట్టు పరిగెత్తవలసి వచ్చేది.

సరోజినివాలకం మేనత్త వచ్చిన మర్నాడే పసికట్టింది. ఏపని చేస్తున్నా, ఎంతఅవసరంలో వున్నా ఆ సమయానికి వాకిట్లో మకాం వెయ్యడం ఆవిడ కర్థం కాలేదు. 'కాపురం చేసుకుంటూన్న పిల్ల అల్లా గుమ్మన్ని పట్టుకు వేలాడ్డం ఏమిటో' అనుకుంది. 'ఏం వొరిగిపోతూవుందే అమ్మా! ఎప్పుడూ వాకిట్లో పీఠం వేసుకు కూర్చుంటావ్!' అని కోడల్ని మందలించనే మందలించింది. 'ఏమో బాబూ! యీ కాలప్పిల్లలూ, అలవాట్లున్నూ! మా అమ్మ అత్తగారికంటే కూడా అదుపు చేసేది. పెళ్ళికో పేరంటానికో బయల్దేరినప్పుడు తప్ప వీధి గుమ్మమంటూ చూడనిచ్చేదా? ఆ అదుపూ ఆజ్ఞ వేరు! యిప్పుడెక్కడున్నాయ్?' అంటూ స్వగతం సాగించేది. సరోజిని తల్లికి తెలుసు ఆడబిడ్డ యీమాట లెవర్ని గురిచూచి కొడుతూవుందో.

సరోజినికి మేనత్తను కనుగప్పి వెళ్ళడమనేది ఎంత కష్టమయేదో—ఆవేళకు వాకిట్లోకి వెళ్ళకుండా వుండడంకూడా అంత కష్టమయేది. పోనీ అత్తయ్యతో 'ఇదీ సంగతి...' అని చెపితే విని వూరుకుంటుందా? దానితో సువార్తా, వొక నీతిశాస్త్రమూ 'మా కాలంలో—' అంటూ ప్రారంభిస్తుందేమో అని సరోజిని భయం. ఈకాలపు అనురాగపద్ధతులూ, మనస్తత్వాలూ బొత్తిగా ఎరుగని యిక్ష్వాకుల నాటిది; ఆవిడతో 'ఏమిటి లె'మ్మనుకుంది చివరికి సరోజిని.

మళ్ళీ సరోజినికి తెరిపిచ్చింది. అయిదారు రోజుల్లో అత్తయ్య 'ఆచారం సాగడం లే'దంటూ వాళ్ళ పల్లెటూరికి వెళ్ళిపోయింది. 'అమ్మయ్యా!' అంటూ సరోజిని నిట్టూర్పు తీసుకుంది.

* * *

సరోజిని గమనిస్తూనేవుంది తను. అతను ఆ ఎదరింటికి మాత్రం తప్పకుండా రోజూ వెడుతూవుంటాడు. ఒకరోజున తను అతనికోసమన్నట్టు గుమ్మంలో నిలబడి వుంది. ఎవరితోనో మాట్లాడుతూ అతను గుమ్మం ఎదుటే నిలబడ్డాడు. చివరికి తనవేపు తిరిగాడు. వస్తాడనుకుని తను చావిట్లోకి తప్పుకుంది. కాని అతను రాలేదు. ఆపక్క నెక్కడికో వెళ్ళాడు. మరోసారి మరీ విచిత్రం! అత[illegible] యింటి ముందునించి తల వంచుకుని వెళ్ళిపోతున్నాడు. సరోజిని చూస్తూనే వుంది. వాళ్ళింటికి యెదురన్న అయిదో యిల్లో ఆరో యిల్లో కోమట్లది. మొన్ననే వాళ్ళ రెండో అబ్బాయి పెళ్ళాం కొత్త కోడలు వొచ్చింది. పిల్ల నేవళంగా చాలా నాజూగ్గా వుంటుంది. ఆ అమ్మాయి కూడా అతని కోసమే అన్నట్టు అతను వాళ్ళ గుమ్మం దాటేదాకా చూస్తూనే వుంది. అది సరోజిని చూచింది. మళ్ళీ వొకటి రెండుసార్లు కూడా ఆ అమ్మాయి అతను వచ్చే వేళకు తన మొగసాల గుమ్మంలో తారట్లాడడం సరోజిని చూచింది. తనలో తనే 'బావుంది లే వరస!' అనుకుంది.

ఆరోజున అమ్మ తలంటువారం పెట్టింది. నాన్న తలంటుకుని స్నానం చేసి బజారు కెళ్ళిపోయాడు. తనకు పోసి అమ్మ పోసుకుంది. బళ్ళోనించి పిల్లల్ని కూడా పిలిపించింది. తమ్ముడికి తలంటయింది. చెల్లాయికి నలుగు పెడుతూవుంది. అతను వచ్చే వేళయింది. తన ధ్యానం అంతా అటే వుంది. నలుగయ్యాక చెల్లెలికి రసం పొయ్యాలి. వెళ్ళడానికి వీల్లేదు. ఆ నలుగన్నా త్వరగా తెమిలితేనా? చెల్లాయి పేచీల్తోనే సరిపోయింది. ఇందాక అమ్మ అననే అంది. 'ధ్యానం ఎక్కడ వుందే? నే నిటు

(53 వ పేజీ చూడండి)

★ గుంటూరు ★

(11-పేజీ తరువాయి)

ఓరోజున మాత్రం ఆమెని పుట్టింటికి తీసుకు వెళ్ళేడు. తను ఒంటరిగా తిరిగి వచ్చేడు. ఆమెని తిరిగి తీసుకురాలేదు.

"అది గుంటూర్లో పుట్టిందన్న సంగతి ముందుగానే నాతో ఎందుకు చెప్పకపోవాలి? అంత రహస్యంగా ఎందుకు దాచాలి?" అని కోపంగా ప్రశ్నిస్తాంటాడు.

"మా అమ్మాయి ఫలానా ఊళ్ళో పుట్టింది. అవూరంటే మీకు ఇష్టం ఉంటే మాఅమ్మాయిని చేసుకోవచ్చు. అవూరంటే మీకు అభ్యంతరం ఏమైనా ఉందా?" అని ఎవరైనా ఎక్కడైనా అడుగుతారా? ఫలానా వూళ్లో పుట్టడం గొప్ప నేరం అని ఎక్కడైనా రాసి ఉందా? ఎక్కడున్నవాళ్లు అక్కడ పుట్టక ఏం చేస్తారు? అదీగాక, నీకిటువంటి వెర్రి ఉందని వాళ్ళకేం తెలుస్తుంది? "నాకు ఈవిధంగా ఒకరోగం ఉందండి. అటుపైన మీ ఇష్టం. పిల్లని ఇస్తే ఇవ్వండి. లేకపోతే మానండి" అని నువ్వెందుకు వాళ్ళతో చెప్పలేదు?" అని ఎంతచెప్పినా లాభంలేదు. మారుమాట్లాడక లేచి వెళిపోతాడు నా దగ్గర్నుంచి.

అంతేగాని, పిల్లని తీసుకురాడు.

నరసన్న ప్రవర్తన గురించి నేను సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బరంపురం వెళ్ళినప్పుడల్లా అతని అత్తవారింటికి వెళ్లేవాణ్ణి. ఆ వెళ్ళడం ఇప్పుడు మానుకోవలసి వచ్చింది.

కాని ఒకసారి వెళ్ళక తప్పిందికాదు. నరసన్న మావఁగారు ఆ వూళ్లో దార్లో కనిపించి వాళ్ళ ఇంటికి లాక్కుపోయారు నన్ను.

నేను వెళ్ళేసరికి నరసన్న భార్య లోపల వరండాలో స్తంభాన్ని ఆనుకొని కూర్చుంది. ఆమె చేతిలో ఓ ఉత్తరం ఉంది. నేను వెళ్లేసర్కి హడావుడిగా లేచింది. ఆమె ఏడుస్తోంది.

"ఎక్కణ్ణించే ఉత్తరం?" అని అడిగేడు ఆమె తండ్రి.

ఆమె జవాబు చెప్పకపోవడం చూసి భర్త రాసిన జాబనే అనుకున్నాం, ఆమె తండ్రి నేనూ కూడా.

"ఏమంటాడే? ఏమంటాడు?" అని అడిగేడు ఆమె తండ్రి.

"అంతే అంతే" అని ఏడుస్తూ కుప్ప కూలబడింది ఆమె. ఏడుస్తూ ఏడుస్తూ కూర్చొంది అలానే.

నాకు అప్పుడు చాలా బాధ కలిగింది. ఏం చెయ్యాలో తోచింది కాదు.

నా చిన్నతనంలో మా ఇంటి పక్క ఓ బట్టతలాయన ఉండేవాడు. ఎండలో, దీపాల వెలుగులో అతని తల నిగనిగలాడేది. మా ఎదటింట్లో బట్టతలవాడు కాని మనిషి ఒకాయన ఉండేవాడు. అతను వయసుకి పెద్ద. పెంకెతనానికి చిన్న. బట్టతలాయన పగలు వీధిలోకి వచ్చినప్పుడల్లా "అయ్యా! ఇంత ఎండగా ఉంది కదా! మీ బట్టతలకి ఓ తలబట్ట ఉపయోగించరాదా?" అని అడిగి నవ్వేవాడు ఎదటింటి మనిషి.

అంతటితో ఆగక మా చిన్నపిల్లల్లో కొంతమందికి కాణీ కాణీ చొప్పున ఇచ్చి మా పక్కింటి బట్టతలాయన్ని "జపాన్ గుండూ, జపాన్ గుండూ" అని ఎదటింటాయన పిలిపించేవాడు కూడాను.

నాకు చిన్నతనం కొబట్టి అంతగా తెలీలేదు, కాని, బట్టతలాయనకి ఎదటింటి ఆసామీయెడల విపరీతమైన కోపం కలిగే ఉంటుంది.

ఒకరోజున నేనూ, ఎదటింటి ఆసామీ యొక్క ఆరేళ్ళ కొడుకూ మా పక్కింటి బట్టతలాయన ఇంటికి ఆయన పిల్లల్తో ఆడుకొందికి వెళ్ళేం. ఆడుకొంటూ ఉంటే అకస్మాత్తుగా బట్టతలాయన వచ్చి ఆరేళ్ళ పిల్లడి రెక్క పట్టుకొని వీపుమీద ఛెళ్లు ఛెళ్లు మని కొట్టి, "ఎవర్రా నిన్నిక్కడకి రమ్మన్నది? పో, మీ ఇంటికి పో" అని కేకలు వేసి కసిరేడు.

ఆరేళ్ళ కుర్రవాడు మొట్టమొదట బిక్కచచ్చిపోయేడు. తరువాత బిగ్గరగా ఏడ్చేడు. ఏడుస్తూ వెళిపోయేడు.

మా అందరికీ బట్టతలాయన ప్రవర్తన చూసి భయం వేసింది. కోపం కలిగింది.

ఆరేళ్ళ పిల్లడు ఆనాడు ఏడ్చినట్టే నరసన్న భార్య స్తంభానికి చేరబడి కూర్చొని ఏడ్చింది.

ఏం మాట్లాడ్డానికి తోచక నేను ఊరుకొన్నాను.

నేను ఉండలేక బైటికి వచ్చేశాను.

తరువాత ఓ స్నేహితుణ్ణి కలుసుకొందికి వెళ్లేను. అతను ఉండే ఇంట్లో ఓ భాగంలో ఎవరో ఒరియా వాళ్ళున్నారు. నేను వెళ్లేసరికి ఆ భాగంలోంచి కటకంలో ఉన్నటువంటి కల్తీ లేని ఒరియా కల్చరు బరంపురంలో లేదని ఒకడు గట్టిగా కేకలు వేస్తున్నాడు.

నేను అక్కణ్ణించికూడా బైటకి వచ్చేశాను.

[ఈ కథలో "నేను," "అప్పల నరసింహం" అనే పాత్రలు నిజం కావు. ఇదంతా ఒక కథ. ఇది నిజంకాదు; కానీ కాదు.] ★

★ ప్రేమదేవత నవ్వింది ★

(8-వ పేజీ తరువాయి)

రుద్దుతూవుంటే అటు రసం పోస్తే ఎల్లా?' అంటూ. తమ్ముడి కళ్ళల్లో కుంకుడుకాయ పోసినందుకు చివాట్లు కూడా తినవలసి వచ్చింది. ఆ అమ్మాయి ఏం చేస్తుంది పాపం! మనస్సంతా వీధి వాకిలివేపే వుంది. సరోజిని కడి పెట్టని ఖయిదయింది. ఎప్పుడీ చెర తప్పించుకుని బయట పడదామా అని తహతహలాడిపోతూవుంది. తను యిక్కడ వున్నా చూపంతా వీధివేపే వున్నది.

ఆవేళ అతనే, నిజానికి అతనే, అతను రానే వచ్చాడు. గుమ్మంలో నిలబడ్డాడు. లోపల సరోజిని కలవరం ఎక్కువైంది. అతను వొక్కొక్క మెట్టూ ఎక్కుతూ వుంటే సరోజినికి గుబులెక్కువవుతూ వుంది. అతను చావిట్లోకి వచ్చాడు. సరోజిని గట్టునపడ్డ చేపపిల్లలా గిలగిలలాడిపోయింది. అతను "సరోజినీ......" అంటూ తన పేరు పెట్టి పిలుస్తున్నాడు. అతని పిలుపన్నా పూర్తికాకుండా వొక్క పరుగున వెళ్ళాలనుకుంది. కాళ్లకు సంకెళ్లుపడ్డట్టయి అడుగు ముందుకు పడలేదు. అమ్మ తనవంకే చూస్తూవుంది. తన కెక్కడ్నుంచి వచ్చిందో తగని సిగ్గు ముంచుకొచ్చింది. మళ్లీ అతను పిలుస్తున్నాడు. 'ఎవరేమనుకున్నా సరే' అని ఎక్కడలేనీ తెగింపువచ్చింది. ఇన్నాళ్లూ యీక్షణం కోసం యీ తియ్యనిక్షణం కోసం ఎదురెదురు చూస్తూ చివరికి అతను వాకిట్లోకి వచ్చి పిలుస్తూవుంటే బిడియం పడ్డమా? సరోజిని సిగ్గుతెరను ఛేదించి లేడిపిల్లలా ఛెంగున వొక్కంగలో వాకిట్లోకి దూకింది.

'ఇదుగోనమ్మా వుత్తరం' అంటూ అతను-అతనంటే పోస్టుబంట్రోతు సరోజినికి ఒక కవరుయిచ్చి వెళ్లిపోయాడు.

గులాబీరంగు కవరూ ముత్యాలు ముగ్గు పెట్టినట్టున్న దానిమీది అక్షరాలూ సరోజినిని పలుకరిస్తున్నాయి. ఒక్కసారి ఆ లేతగుండెలో వుడుకులాంటప్పు చల్లదనం-స్వస్తిక్ హెయిరాయిల్ సువాసనా-కస్కస్ సెంటు పరిమళాలూ, అన్నీ గుప్పున గుబాళించాయి. ఇన్నాళ్లూ తను దీనికోసం; యీ కవరుకోసం; యీవారు 'వ్రాస్తా'నన్న మొదటి వుత్తరంకోసం పడిన తపన అంతా తొలకరివానకు వేగిన భూమిలాగా చల్లబడిపోయింది. తన తపస్సు ఫలించింది. ప్రేమదేవత ఫక్కున నవ్వింది! ★